

జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నీవన్‌కుమార్

ఆ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

బేగంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న కొందరు టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పడి నీవన్‌కుమార్ కోరారు. జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ కర్ణన్‌ను కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. బేగంపేట సర్కిల్‌లోని టౌన్‌ప్లానింగ్ లో కొందరు సిబ్బంది అవినీతికి అంతేలేకుండా పోయిందన్నారు. దీని వల్ల సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయన్నారు. బేగంపేట, రాంగోపాల్‌పేట, రాణిగంజ్, బన్సీలాల్‌పేట, పద్మారావునగర్‌తో పాటు సమీప ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ నిర్మాణాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన మున్షీలు నిర్మాణదారుల వద్ద లంచాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. 20 సంవత్సరాలుగా బదిలీలు లేకుండా ఒకే ప్రాంతంలో ఉన్న మున్షీలపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రశాంతంగా నీట్



నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధరమ్ కరం రోడ్డు ప్రభుత్వ పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 240 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు.

అమీర్‌పేట, మే 4 (ఆంధ్రజ్యోతి):

ఈ బాలిక 'బంగారం'

ఎర్రగడ్డ, మే 4 (ఆంధ్రజ్యోతి): అండర్ 17 అంతర్ జిల్లా కుస్తీ రెజ్లింగ్ పోటీల్లో ఎర్రగడ్డ బాలిక స్వర్ణం సాధించింది. తెలంగాణ ఆమెచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఎర్రగడ్డ బీ శంకర్ లాల్ నగర్‌కు చెందిన పూజా నిత్లేకర్ 46 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించింది.
అలాగే ఈనెల 25 నుంచి 27 వరకు చండీగఢ్‌లో జరగనున్న అండర్ 17 జాతీయ రెజ్లింగ్ చాంపియన్ పోటీల్లో ఆమె పాల్గొనబోతోంది.



బంగారు పతకం, ప్రశంసా పత్రంతో పూజా నిత్లేకర్



సమావేశంలో బస్తీవాసులు

మహాత్మానగర్‌కు ఎన్నికలు నిర్వహించాలి

బోరబండ, మే 4 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ మహాత్మానగర్‌కు ఎన్నికలు జరిపించాలని బస్తీ వాసులు కోరుతున్నారు. మహాత్మానగర్ లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపకుండా నాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడి పేరిట ఒకరు, ప్రస్తుత అధ్యక్షుడి పేరిట మరొకరు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇద్దరి వ్యవహారంతో బస్తీవాసులు నలిగిపోతున్నారని, ఇదేమని అడిగిన వారిపై కేసులు పెట్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు వారాలుగా బస్తీ వాసులంతా సమావేశం అయినా నాయకులు మాత్రం హాజరు కాలేదని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల నిర్వహణపై చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అడహక్ కమిటీ ప్రతినిధులు రాజేష్, శ్రీశైలం, ఎం. భాస్కర్, ఎ.నరసింహ, సిద్దప్ప, ప్రభాకర్, బుద్ధ, సిద్ధులు, వెంకటయ్య, రూతమ్మ, లక్ష్మి, కమలమ్మ, పార్వతమ్మ, జి.పుష్ప, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.



సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో సహపంక్తి భోజనం చేస్తున్న కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకులు

సహపంక్తి భోజనం

ఎర్రగడ్డ, మే 4 (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పంపిణీ అనేది ఒక పథకం కాదని, అది పేదోడికి వరం లాంటిదని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దూడల రవి గౌడ్ అన్నారు. ఎర్రగడ్డలోని హేమవతి నగర్ బస్తీలో నివాసం ఉంటున్న సన్న బియ్యం లబ్ధిదారురాలు బీ మణెమ్మ ఇంట్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు సహపంక్తి భోజనం చేశారు. సన్న బియ్యం పథకంలో పేదవాళ్ల జీవితాల వెలుగులు రావడం ప్రారంభమైందన్నారు. ఈ పథకం ద్వారా ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ రమేష్ నాయక్, నాయకులు గంటా మల్లేష్, సురేష్ గౌడ్, ఎం హనుమంతరావు, బాబి, యాకమ్మ, ఉమా, రాజమణి, కుమారి పాల్గొన్నారు.



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు అశోక్ తదితరులు

సార్వత్రిక సమ్మెకు తరలిరండి

ఎర్రగడ్డ, మే 4 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం సమ్మె తాలూకా ఫ్లెక్సీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రాపర్తి అశోక్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అడ్డాల మీద షెడ్‌ల సౌకర్యం, మంచినీరు, బాత్రూమ్స్ ఏర్పాటు చేయాలని, ఇన్సూరెన్స్ కార్డు అందరికీ ఇవ్వాలన్నారు. వాటితో పాటు తదితర డిమాండ్లు నెరవేర్చాలని ఈనెల 20న నిర్వహించ చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమ్మె కరపత్రాలను సైతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రఘుకుమార్, రాంబాబు పాల్గొన్నారు.



చిత్రకారులతో రౌనత్ యార్ జంగ్, అమర్ తదితరులు

ఉగ్రదాడికి చిత్రకారుల నిరసన

పంజాగుట్ట, మే4 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ ఆదివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉగ్రదాడికి నిరసనగా...చిత్రకారుల ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, ఎంవీ రమణ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ హైదరాబాద్, తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం, హైదరాబాద్ ఫోరం ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పలువురు చిత్రకారులు, కార్టూనిస్టులు తమ చిత్రాలు, కార్టూన్లను గీసి నిరసన తెలిపారు. కాగా, తొమ్మిదో నిజాం రౌనత్ యార్ జంగ్ చిత్రాలను తిలకించారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. ప్రదర్శనలో చిత్రకారులు మురళీధర్. కె, డాక్టర్ హోతి బస్వరాజ్, అర్చన శైలేష్, రాము మారేడు, సత్య గనోజ్, నాగుల రాజేందర్, పలువురు చిత్రకారులు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ స్థలం ఆక్రమణ.. ఇద్దరిపై కేసు

బోరబండ మే 4 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మండల తహసీల్దార్ ఎం.డి. నయీమొద్దీన్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ సర్వేనంబర్లు 126, 127 పరిధిలో 2 ఎకరాల 9 గుంటల ప్రభుత్వ స్థలాన్ని జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళిక విభాగానికి అప్పగించారు. క్వారీ స్థలం సుందరీకరణ కోసం అప్పగిస్తే అప్పటికే అందులో ఆలయాలు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ఉన్నాయి. అయితే 58 జీవో కింద కొన్ని పట్టాలను సైతం మంజూరు చేశారు. కాగా పి. వాసు, సురేష్ కుమార్ అనే ఇద్దరు 60, 80 గజాల స్థలాలు ఆక్రమించినట్లు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు.

జరిమానాలకు రంగం సిద్ధం

వచ్చే వారం నుంచి అమల్లోకి

స్వచ్ఛ ఆటో టిప్పర్లకు చెత్త ఇవ్వకుంటే జరిమానాలు విధించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మహిళా పొదుపు సంఘాలకు, రిసోర్స్ పర్సన్లకు ఆ అధికారాలు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఎస్ఎఫ్ఎలు, మహిళా సంఘాలు, స్వచ్ఛ ఆటో టిప్లర్ల నిర్వాహకులు, రిసోర్స్ పర్సన్లతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఇంటింటికి తిరుగుతూ చెత్తను ఎవరెవరు ఆటో టిప్పర్లలో వేస్తున్నారు.. ఎవరు వేయడం లేదన్న విషయాలపై దృష్టి పెట్టారు. స్వచ్ఛ ఆటో టిప్లర్ల వారు సమయపాలన పాటిస్తున్నారా? సరిపడా ఆటోలు ఉన్నాయా ? అనే విషయమై పరిశీలన ప్రారంభమైంది. మరో వారం రోజుల్లో జరిమానాలు వేయడం ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

- స్వచ్ఛ ఆటో టిప్పర్లకు 'చెత్త' ఇవ్వాల్సిందే..
- నాలుగు బస్తీలు, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ఆచరణ



బస్తీలో అవగాహన కల్పిస్తున్న జూబ్లీహిల్స్ సర్కిల్ అధికారులు

ఖైరతాబాద్,మే3(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ఈ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఉదయ్‌నగర్, సింగాడ బస్తీ, ఎన్‌బీటీ నగర్, ఇందిరానగర్ (నాలుగు) బస్తీలలో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కోసం పనులు ప్రారంభించారు. పొదుపు గ్రూపు మహిళలు, రిసోర్స్ పర్సన్లు, ఎస్ఎఫ్ఎలు ఇప్పటికే ఈ బస్తీలలో ఇంటింటికీ తిరుగుతున్నారు. స్వచ్ఛ ఆటో టిప్పర్ల వారికే చెత్త ఇవ్వాలని, బహిరంగ ప్రదేశాల్లో వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్నారు. ఎవరు ఎక్కడ వేస్తున్నారనే విషయమై పరిశీలన సైతం వేగంగా జరుగుతోంది. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తున్న వారికి అవగాహన కల్పిస్తుండగా మొండికేసి ఎదురు తిరుగుతున్న వారితో నేరుగా అధికారులు సంప్రదించి అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఇంట్లో యజమానులు, అద్దె కుండే వారి వివరాలను సేకరిస్తున్న సిబ్బంది అద్దెకుండేవారు చెత్తను విధిగా స్వచ్ఛ టిప్పర్లకు ఇచ్చేలా యజమానులు చొరవ చూపాలని సూచిస్తున్నారు. వేయకపోతే వారికి వేసే జరిమానాను ఇళ్ల యజమానులకు విధిస్తామని అవగాహన కల్పిస్తున్నారు. ఈ బస్తీలలో విజయవంతమైతే సర్కిల్ మొత్తం అమలు చేస్తామని అధికారులు తెలుపుతున్నారు.

500 నుంచి 2 వేల వరకు ఫైన్‌లు..

బహిరంగంగా చెత్తను వేయడం పూర్తిగా నిర్మూలించాలనే ఏకైక లక్ష్యంతో మహిళా పొదుపు సంఘాలు, యూసీడీ విభాగం రిసోర్స్ పర్సన్లు 500 రూపాయల నుంచి 2వేల రూపాయల వరకు జరిమానా విధించే అధికారాలను కల్పించారు. చెత్తను ఇవ్వని ఇళ్ల యజమానులకు సైతం 500 రూపాయల నుంచి 2వేల రూపాయల వరకు జరిమానా వేయొచ్చని ఉత్తర్వులిచ్చారు. జరిమానాల ద్వారా వచ్చిన పైకాన్ని పర్యావరణ పరిరక్షణ కోసం పొదుపు సంఘాలకు వినియోగించాలని నిర్ణయించారు. బట్ట బ్యాగుల పంపిణీ, ప్లాస్టిక్ వాడకం తగ్గేలా అవగాహన కార్యక్రమాలు, నీటి పొదుపు, మొక్కలు నాటాలనే అవగాహన కార్యక్రమాలకు ఖర్చు చేయనున్నారు.

కఠిన చర్యలు తప్పవు



బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయొద్దని స్వచ్ఛ ఆటో టిప్పర్లను జీహెచ్ఎంసీ వినియోగిస్తోంది. ఇప్పటికీ కొందరు చెత్తను వేయకుండా బహిరంగంగా జారవిడుస్తున్నారు. మన గ్రేటర్‌లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో ఈ ప్రయోగాన్ని చేపడుతున్నాం. ప్రస్తుతం అవగాహనతో పాటు పరిశీలన జరుగుతోంది. మార్పు కోసం జరిమానాలు విధించక తప్పదు.

- సమ్మయ్య
ఉపకమిషనర్, జూబ్లీహిల్స్ సర్కిల్





భగీరథ మహర్షి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ వెంకటేష్ తదితరులు

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

బంజారాహిల్స్, మే 4(ఆంధ్రజ్యోతి): భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఆదివారం ఫిలింనగర్ లో ఘనంగా జరిగాయి. ఈ ప్రాంతంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్గారావుతో పాటు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ నివాళులు అర్పించారు. అనుకున్నది సాధించే వరకు పట్టువదలని విక్రమార్కుడి వలే కృషి చేసే విషయంలో భగీరథను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. నేతలు మధు సాగర్, నాగేష్ సాగర్, సహదేవ్, ఎస్.పి. శ్రీను. సి. రామచంద్రయ్య, వెంకటేశం, గోవిందు, శేఖర్, తిరుపతయ్య, కాటూరి రమేష్, రామకృష్ణ సాగర్. ఈశ్వర్, సగర మహిళా సంఘం నేతలు ఎం. స్వప్న, కె. లక్ష్మి, ఎస్పీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు దీపక్ చౌదరి, టీడీపీ నాయకుడు నర్సింహ తదితరులు కూడా ఆయన విగ్రహానికి పూలమాలేసినివాళులర్పించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



నరేష్ మృతదేహం

బేగంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రసూల్‌పురలోని అన్నానగర్‌కు చెందిన నరేష్ (23) ఓ ప్రైవేటు ఉద్యోగి. అతనికి భార్యతో పాటు మూడు నెలల కుమారుడున్నారు. కొద్ది నెలలుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అతను ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతసేపు తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు తలుపు తీయగా ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మధురానగర్ పోలీస్‌స్టేషన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మమ్మద్ షకీల్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు మొహమ్మద్ మొహసిన్ ఖురేషి , ఎర్ర కృష్ణ కుమార్, ఆజం, అబ్బాస్, ఏ యాదగిరి యాదవ్, పి ఆకాష్, హరికృష్ణ, శ్రీనివాస్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకు అభినందనలు తెలిపారు.
(ఎర్రగడ్డ, మే 4, ఆంధ్రజ్యోతి)

కారుతో ఢీకొట్టి.. ఆపై దాడి చేసి..

అమీర్‌పేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని కారుతో ఢీ కొట్టి, ఆపై దాడి చేసిన ఓ వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బేగంపేటకు చెందిన మహమ్మద్ షాబాజ్ అక్రమ్ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై అమీర్‌పేట నుంచి బేగంపేటకు వెళ్తున్నాడు. ఓ వ్యక్తి తన కారును నిర్లక్ష్యంగా నడిపి ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో షాబాజ్ అక్రమ్ కింద పడ్డాడు. అయితే కారు దిగి వచ్చిన వ్యక్తి షాబాజ్‌పై దాడి చేసి కొట్టాడు. దీంతో తలకు గాయమైంది. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు జగ్జిత్‌సింగ్ (30)ను గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎల్ఓసీ అందజేత



అమీర్‌పేట, మే 4 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని లబ్ధిదారుడికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. ఆదివారం తన నివాసంలో పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాపునగర్‌కు చెందిన కల్లీబాయ్ (60)కి మంజూరైన రూ 2.25 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని ఆమె కుమారుడు ముఖేష్ అందజేశారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు హరిసింగ్ జాదవ్, గోపీలాల్ చౌహాన్ తదితరులు ఉన్నారు.

ఉత్సవ్.. ఆద్యంతం ఆహ్లాదం

ఖైరతాబాద్,మే4(ఆంధ్రజ్యోతి): పీపుల్స్‌ప్లాజాలో నిర్వహిస్తున్న సమ్మర్ ఉత్సవ్ మేళా ఆద్యంతం ఆనందాన్ని పంచుతున్నది. దుబాయ్ విమానం నమూనా, ఫిష్ టన్నెల్ అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. విమాన నమూనా గుండా లోపలికి వెళితే దుబాయ్ బుర్జ్ ఖలీఫాను చూసిన అనుభూతి అందిస్తున్నది. ఇక టన్నెల్‌లో రకరకాల చేపలు మిరుమిట్లు గొల్పుతున్నాయి. సముద్రం అడుగు భాగాన ఉన్నట్లు తలపిస్తున్నది. ఉదయం ఎండతో అల్లాడిపోతున్న నగరవాసులు సాయంత్రం ఈ మేళాలో సేదతీరు అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. వందలాది మంది సందర్శకులతో కిటకిటలాడుతోంది. ఎన్నో రకాల ఏలియన్స్.. ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణ అని చెప్పొచ్చు. ఉత్సవ్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్నో రకాల వస్తువులతో కూడిన స్టాళ్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల నుంచి యువత వరకు సరదాగా గడిపేందుకు ఆసక్తిని చూపుతున్నారు. ఎన్నో రకాల ఎమ్యూజ్‌మెంట్‌లు అందరినీ ఆకర్షిస్తున్నాయి. పీవీ నర్సింహారావు మార్గంలోని పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటైన ఈ మేళా రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్ తెలిపారు.



సమ్మర్ ఉత్సవ్ మేళా ప్రధాన ద్వారం వద్ద సందర్శకులు

రెండు చోట్ల చైన్‌స్నాచింగ్



యూసుఫ్ గూడ, మే 4 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లిన మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెల తాడు తెంపుకెళ్లాడు ఓ దుండగుడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్‌కు చెందిన మంగళం శంకరమ్మ యూసుఫ్‌గూడ బస్తీ కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగింది. పక్కనున్న ఖాళీ స్థలంలో బహిర్భూమికి వెళ్లింది. ఆమె వెళ్లడం గమనించిన ఓ యువకుడు బెదిరించి మూడు తులాల పుస్తెల తాడును తెంపుకొని పారిపోయాడు. వెంటనే శంకరమ్మ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● హైటెక్ సిటీ : మహిళను బెదిరించి పుస్తెలతాడు తెంపుకెళ్లిన సంఘటన మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ విజయ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం వివరాలు... బోరబండ ప్రాంతానికి చెందిన భాగ్యలక్ష్మి కావూరి హిల్స్‌లో హౌస్ కీపింగ్ వర్క్ చేస్తోంది. రోజూలాగే పని ప్రాంతానికి ఇంటి నుంచి గుట్టల బేగంపేట మీదుగా కావూరి హిల్స్‌కు నడిచి వెళ్తున్నది. మార్గ మధ్యలో ఇద్దరు వచ్చి ఆమెను బెదిరించి పుస్తెల తాడు తెంపుకొని వెళ్లారు. వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

10 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

బోరబండ, మే 4 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ స్వరాజ్ నగర్ హరిహర క్షేత్ర దేవస్థానంలో లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు 10 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే వేడుకల్లో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 12న వైశాఖ పౌర్ణమి రోజున స్వామివారికి సుప్రభాత సేవ, సుదర్శన హోమం, చక్రస్నానం, విష్ణు సహస్రనామ పారాయణం, ధ్వజావరోహణం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ధర్మకర్త కలవల సత్యనారాయణరావు తెలిపారు.

9న కల్యాణ మహోత్సవం

బోరబండ, మే 4 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేస్-2 శ్రీకనకదుర్గా భవాని దేవాలయ ప్రాంగణంలోని అశ్వథ వృక్షం (రావి) నింబ (వేప) స్వరూప లక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవం 9న నిర్వహించనున్నారు. ఇదే ప్రాంగణంలోనే ఉన్న శివపార్వతుల స్వరూప వట వృక్షం, వేప చెట్టు కల్యాణాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వేముల యాదయ్య తెలిపారు. భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ జరుగుతోందని చెప్పారు.

శారీరక శ్రమ లేమితోనే వెన్నునొప్పి



డాక్టర్ హిమనుషు ప్రసాద్

బేగంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవన శైలి- ప్రధానంగా డెస్క్ జాబ్స్ భౌతిక శ్రమ లేక పోవడం వల్ల గణనీయంగా వెన్ను నొప్పి కేసులు పెరుగుతున్నాయని బేగంపేట కిమ్స్- సన్‌షైన్ హాస్పటల్ స్పైన్ సర్జన్ డాక్టర్ హిమనుషు ప్రసాద్ తెలిపారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెన్ను నొప్పి వల్ల మహిళలు ఎక్కువగా ప్రభావితమవుతున్నప్పటికి , పురుషులు సైతం దీని తీవ్రతను అనుభవిస్తున్నారన్నారు. శారీరక వ్యాయామం, శరీర స్థితి సరి చేయడం, బరువు తగ్గించడం, నొప్పి నియంత్రణ వంటి పరిరక్షణాత్మక చికిత్సల ద్వారా సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. సరైన వైద్య సలహా తీసుకుంటే అది పూర్తిగా నియంత్రణలోకి వస్తోందన్నారు.



మంగళ సూత్రం చూపిస్తున్న అర్చకులు

కనులపండువగా కల్యాణం

అమీర్‌పేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాణ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, కలశ సంప్రోక్షణ చేశారు. కల్యాణం చూసేందుకు భక్తులు తరలివచ్చారు. సాయంత్రం శుభ నివేదన, హారతి ఇచ్చి దేవతామూర్తులను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలో ఎమ్మెల్యే



నల్లపోచమ్మ ఆలయంలో దేవతామూర్తుల యంత్ర ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

అడ్డగుట్ట, మే 4(ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్‌లోని జేఎల్‌ఎస్‌నగర్‌లో ఉన్న మహంకాళి నల్లపోచమ్మ దేవాలయంలో ఆదివారం జరిగిన యంత్ర ప్రతిష్ఠ, గోపూజ, విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, పూజారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేసిన ఆర్పీఎఫ్ పోలీసులు

ఆర్పీఎఫ్ పోలీసుల తనిఖీలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ డివిజన్‌లోని నాంపల్లి, లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వెయిటింగ్ హాళ్లు, పార్శల్ కార్యాలయం, స్టాల్స్‌లలో డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీలను స్కానర్ ద్వారా తనిఖీలు చేసి పంపించారు. రైళ్లలో ప్రయాణం చేసే ప్రయాణికులకు భద్రత విషయంలో అవగాహన కల్పించారు. అనుమానిత వ్యక్తులను గమనిస్తే 139 నంబరుకు సమాచారం ఇవ్వాలని, మీ తోటి ప్రయాణికులు ఇచ్చే తినుబండరాలు తీసుకోవద్దని సూచించారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువ బంగారు ఆభరణాలు ధరించి ప్రయాణం చేయవద్దని సూచించారు.



నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీకాంత్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి

అడ్డగుట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ కేకేసీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గంట రాజుసాగర్ కోరారు. ఈ సందర్భంగా తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌రెడ్డిని కలిసి సన్మానం చేసి సూచనలు ఇచ్చారు. సీఐని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జాఫర్, సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత కృష్ణారావు, ఎస్సీ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి భూపతి హరి, అడ్డగుట్ట డివిజన్ ఉపాధ్యక్షుడు మంద ప్రభాకర్, కోశాధికారి రమేష్, అడ్డగుట్ట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిచందర్‌లు పాల్గొన్నారు.

క్రైమ్ సమాచారం

సికింద్రాబాద్‌లో వ్యక్తి అదృశ్యం



వెంకట్‌రావు

అడ్డగుట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ వివరాల ప్రకారం నిజామాబాద్‌కు చెందిన వెంకట్‌రావు చందానగర్‌లో ఉంటున్న సోదరి అనసూయ ఇంటికి గత నెల వచ్చాడు. గత నెల 31న చందానగర్ నుంచి అనసూయతో పాటు వెంకట్‌రావు ఇద్దరూ కలిసి సికింద్రాబాద్‌కు వచ్చారు. సోదరి వస్తువులు కొందామని అన్న వెంకట్‌రావును అశోక హోటల్ వద్ద నిలబడి చెప్పి షాపింగ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చి చూసే సరికి అన్న వెంకట్‌రావు అక్కడ కనిపించలేదు. వెంకట్‌రావు భార్య లక్ష్మికి అనసూయ ఫోన్ చేసి విషయం తెలిపింది. ఈ క్రమంలో భార్య లక్ష్మి సికింద్రాబాద్‌కు చేరుకుని గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో 2వ తేదీన భర్త మిస్సింగ్ కేసు కింద ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో పోలీసులు డీడీ ఎంట్రీ చేసుకుని 4న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదృశ్యమైన వెంకట్‌రావు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే 8712571547 నంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారుతో ఢీకొట్టి.. ఆపై దాడి

అమీర్‌పేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని కారుతో ఢీ కొట్టి, ఆపై దాడి చేసి గాయపరిచిన ఓ వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బేగంపేటకు చెందిన మహమ్మద్ షాబాజ్ అక్రమ్ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై అమీర్‌పేట నుంచి బేగంపేటకు వెళ్తున్నాడు. ఓ వ్యక్తి తన కారును నిర్లక్ష్యంగా నడిపి ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో షాబాజ్ అక్రమ్ కింద పడ్డాడు. అయితే కారు దిగి వచ్చిన వ్యక్తి షాబాజ్‌పై దాడి చేసి కొట్టాడు. దీంతో తలకు గాయమైంది. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు జగ్మిత్‌సింగ్ (30)ను గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



నరేష్

బేగంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రసూల్‌పురలోని అన్నానగర్‌కు చెందిన నరేష్(23) ప్రైవేటు ఉద్యోగి. నరేష్‌కు భార్య, మూడు నెలల కుమారుడు ఉన్నారు. గత కొద్ది నెలలుగా ఇంట్లో వివాదాలు నెలకొన్నాయి. కుటుంబ కలహాలతో విసిగిపోయిన నరేష్ ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు తలుపుతీయగా ఫ్యాన్‌కు వేలాడడం గమనించి బోరుమన్నారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులపై చెల్లికి ఏడు పేజీల లేఖ.. అదృశ్యం



శ్రీనివాస్



శోభ

హైదర్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో దంపతులు అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. కేపీహెచ్‌బీ ప్రాంతానికి చెందిన సిద్ధబాతుల శ్రీనివాస్ (50), శోభ (45) భార్యాభర్తలు. వారి బంధువుల ఇంట్లో పెళ్లికి హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో శ్రీనివాస్ తాను ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరిస్తూ తన చెల్లికి ఏడు పేజీల లేఖను ఫోన్ ద్వారా పంపించాడు. తమ కోసం వెతకవద్దని అందులో పేర్కొన్నాడు. ఆ తర్వాత ఇద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో శ్రీనివాస్ సోదరుడు అశోక్ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ దారి దుర్గంధ భరితం

పట్టించుకోని అధికారులు ● పబ్లిక్ టాయిలెట్స్ లేక ప్రజల అవస్థలు

పద్మారావునగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చెత్త కుప్పలు, మురుగునీటి నిల్వలతో ఆ దారి దుర్గంధ భరితం. బన్సీలాల్‌పేట్ డివిజన్ గాంధీ ఆసుపత్రి వెనుక గేటు వైపున ఉన్న రోడ్డులో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఒకవైపు మురుగు కాలువ, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ఓవర్‌ఫ్లోతో రోడ్డు పక్కన మురుగునీటి నిల్వలు ఏర్పడి ఆ పరిసరాలు దుర్గంధ భరితమయ్యాయి. అలాగే కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో నిర్మాణ, ఇతర వ్యర్థాలను తీసుకువచ్చి పారవేస్తున్నారు. దాంతో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. మరోవైపు సమీప ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో బహిరంగ మూత్ర విసర్జనతో ఆ ప్రాంతమంతా దుర్గంధ భరితంగా మారి, ఆ దారిన వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. వాటికి సరైన నిర్వహణ లేక మూలనపడ్డాయి. గాంధీ ఆసుపత్రి వెనుక వైపున ఉన్న మురుగునీటి కాల్వ ఓవర్‌ఫ్లో నిలువరించటానికి జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో తరచూ మురుగునీరు రోడ్డుపైకి పారుతోంది. ఒకవేళ వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందనడంలో సందేహం లేదు. మురికినీటి నిల్వలు, చెత్త కుప్పల కారణంగా దోమల బెడద పెరిగి స్థానిక ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, ఎంటమాలజీ అధికారులు చెత్త కుప్పలు, మురుగునీటి నిల్వల తొలగింపుకు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని కోరుకొంటున్నారు.



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త, మురుగు నీటి నిల్వ



అధ్వానంగా మారిన పబ్లిక్ టాయిలెట్స్

ప్రజారోగ్యాన్ని కాపాడాలి



గాంధీ ఆసుపత్రి వెనుక రోడ్డులో చెత్త కుప్పలు, మురికినీటి నిల్వలతో అధ్వానంగా మారింది. దుర్గంధం కారణంగా ఆ దారిలో నడవలేని దుస్థితి నెలకొంది. చెత్త కుప్పలను తొలగించాలి. దోమల నివారణకు ఎంటమాలజీ, జీహెచ్ఎంసీ సిబ్బంది కెమికల్ స్ప్రే, ఫాగింగ్ వంటి చర్యలను చేపట్టి ప్రజాఆరోగ్యాన్ని కాపాడాలి.

- యాదగిరి, హమాల్‌బస్తీ

పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుచేయాలి



పబ్లిక్ టాయిలెట్స్ లేని కారణంగా పద్మారావునగర్‌లో అంతర్గత రోడ్లన్నీ బహిరంగ మూత్ర విసర్జనతో దుర్గంధ భరితంగా మారుతున్నాయి. గతంలో టాయిలెట్స్ ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ కరువై, ఉపయోగించుకోలేని స్థితికి చేరుకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

- మామిడి బాల్‌రెడ్డి, పద్మారావునగర్ సంక్షేమ సంఘం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రశాంతంగా నీట్ పరీక్ష

రెజిమెంటల్‌బజార్, మే 4(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు.

ఆదివారం జరిగిన నీట్ పరీక్షకు నార్త్ జోన్ పరిధిలో ఏర్పాటు చేసిన 11 కేంద్రాలలో 5520 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద తాత్కాలిక నో పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ మళ్లించి, సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. హైదారాబాద్ ట్రాఫిక్ పోలీస్ తరఫున విష్ యు ఆల్ ది బెస్ట్ బోర్డులతో విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

న్యూ గవర్నమెంట్ కాలేజీలో..

సికింద్రాబాద్ న్యూ గవర్నమెంట్ కాలేజీలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులను కేటాయించగా ఇద్దరు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. విద్యార్థులను హెచ్ఎండీతో తనిఖీ చేసి వీడియో రికార్డింగ్ చేస్తూ గంటన్నర ముందు నుంచి లోపలికి అనుమతించారు. మహంకాళి ఏసీపీ సైదయ్య, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, ఎస్సై శ్రీవర్ధన్, ట్రాఫిక్ ఎస్సై మహేష్ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్ రాజు



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటు కార్యక్రమానికి హాజరైన నాగులూరి సాయిబాబా, బస్తీ నాయకులు

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

పద్మారావునగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దేశానికి అపూర్వ సేవలను అందించిన అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ వంటి వారి విగ్రహాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావడం తన అదృష్టమని ప్రముఖ పారిశ్రామికవేత్త, కాంగ్రెస్ నాయకులు నాగులూరి సాయిబాబా అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి హమాల్‌బస్తీలోని కమ్యూనిటీ హాలు వద్ద ఆయన తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆవిష్కరించారు. అంబేడ్కర్ మెమోరియల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బస్తీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తిరుమలగిరి మే 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని కంటోన్మెంటు బోర్డు మాజీ సభ్యుడు లోకనాథ్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డిలు అన్నారు. బొల్లారం రిసాలబజార్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. రిసాలబజార్ చౌరస్తాలో ప్రయాణికులు, అడ్డా కూలీలు చల్లని నీరు సేవించి దాహార్తిని తీర్చుకుంటారన్నారు. అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రంను ఏర్పాటు చేయడంతోపాటు ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేయడం ప్రశంసనీయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఖదీరవన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ రాము, అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్, ఉమేష్ రావు, అశోక్, కేజీ రవి, చందర్, చంద్రకాంత్‌ఉన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బోర్డు మాజీ సభ్యుడు లోకనాథ్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

మౌలాలి, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని పలు కాలనీలవాసులు ఎమ్మెల్యేతో క్యాంపు కార్యాలయంలో సమావేశమై ముంపు నివారణలో భాగంగా బాక్స్ డ్రైనేజీల నిర్మాణం, పలు కాలనీలలో సీసీ రోడ్లు, నీటి ఎద్దడి నివారణలో భాగంగా పలు కాలనీలలో పవర్‌బోర్‌ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ సమస్యపై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● గౌతంనగర్ డివిజన్ జేఎల్ఎన్ఎస్‌నగర్‌లో నల్లపోచమ్మ, మహంకాళీ, ఎల్లమ్మ దేవత విగ్రహప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతయాదవ్‌లు పాల్గొన్ని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాండురంగన్, సత్యనారాయణ, సాధు పరమేష్, శ్యామ్‌గౌడ్, రాజామల్లేష్, నాయకులు జేఏసీ వెంకన్న, సిద్దిరాములు, కిట్టు, నర్సింగ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అల్వాల్ ప్రధాన కూడళ్ల వద్ద సుందరీకరణ పనులు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఏ వెంకటేష్ తదితరులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సుందరీకరణ పనులు

అల్వాల్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా అల్వాల్ ప్రధాన కూడళ్ల వద్ద సుందరీకరణ పనులను ఎస్ఎఫ్ఏ వెంకటేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఆదివారం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఎఫ్ఏ వెంకటేష్ పేర్కొన్నారు. టెంపుల్ అల్వాల్‌లో ప్రధాన చౌరస్తాల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు మొక్కలను నాటి, గోడలపై, రోడ్లపై పెయింటింగ్స్ వేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు స్వామి, భాస్కర్, చిత్తారి, వెంకట్‌రామ్‌రెడ్డి, విష్ణుతో పాటు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రంగస్థల దర్శకుడు, నటుడు మృతికి సంతాపం

చిలకలగూడ, మే 4(ఆంధ్రజ్యోతి): రంగస్థల నటుడు, దర్శకుడు, నంది అవార్డు గ్రహీత ఉదయభాను(69) శుక్రవారం ఆకస్మిక మృతికి దక్షిణ మధ్య రైల్వే లలిత కళాసమితి ప్రగాఢ సానుభూతి తెలిపింది. రైల్వే అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహించి పదవీ విరమణ గావించాడని, రైల్వేలో నాటకరంగ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు మరువలేనివని మాజీ కార్యదర్శులు మంత్రి భుజంగరావు, కె.వి.బాలాజీరావు, రచయిత నటుడు శ్రీకంఠా హనుమంత రావు, గోవిందు తెలిపారు. ఆయన దర్శకత్వంలో అనేక నాటకాల్లో నటించామని, సృజనాత్మకతతో నాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించాడని అన్నారు. భూమిక సంస్థను స్థాపించి రసరంజనిలో టికెట్ నాటకాలకి ఆద్యుడని అనేక అవార్డులతో పాటు చరణ్ దాస్ నాటకానికి నంది అవార్డు అందుకున్నాడని పేర్కొన్నారు.

భక్తి, శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన

చిలకలగూడ, మే 4(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ, ఉమామహేశ్వర ఆలయంలో ఆదివారం కాల భైరవస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాల పునఃప్రతిష్ఠ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం శిఖర కలశాభిషేకం, మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం, అన్నదాన ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం కాలభైరవస్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు మెట్టుగూడ వీధుల్లో నిర్వహించారు. ఆలయ చైర్మన్ ధారబోయిన శ్రీనివాస్, గోవర్ధన్ యాదవ్ కార్యవర్గ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టారు



విగ్రహ ప్రతిష్ఠలో కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు

అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వినతి



జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముప్పిడి నవీన్‌కుమార్

బేగంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న కొందరు టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ నూతన కమీషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బేగంపేటలో జరిగిన సమావేశంలో నవీన్‌కుమార్ మాట్లాడుతూ బేగంపేట సర్కిల్‌లోని టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు సిబ్బంది అవినీతికి అంతులేకుండా పోయిందన్నారు. దీనివల్ల సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయన్నారు. బేగంపేట, రాంగోపాల్‌పేట, రాణిగంజ్, బన్సీలాల్‌పేట, పద్మారావునగర్‌తో పాటు సమీప ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ నిర్మాణాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన మున్షీలు నిర్మాణదారుల వద్ద లంచాలు తీసుకుంటూ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. గత 20 సంవత్సరాలుగా బదిలీలు లేకుండా ఒకే ప్రాంతంలో ఉన్న మున్షీలపై చర్యలు తీసుకోవాలన్నారు.

మేనకోడలే అసలు సూత్రధారి

● దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
●ముగ్గురు నిందితుల అరెస్ట్
● 3.5తులాల బంగారు నగలు, సెల్‌ఫోన్ స్వాధీనం

బౌద్ధనగర్, మే 4(ఆంధ్రజ్యోతి): పార్శిగుట్టలో రెండు రోజుల క్రితం జరిగిన మహిళ బంగారు నగలు దోపిడి కేసును వారాసిగూడ పోలీసులు ఛేదించారు. ఒంటరిగా ఉంటున్న మేనత్త దగ్గర నుంచి బంగారు నగలను కొట్టివేయటానికి సూత్రధారి మేనకోడలే దోపిడిని చేయించినట్లు విచారణలో తేలింది. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డిలు వివరాలను వెల్లడించారు. పార్శిగుట్టలో పారిజాత(56) మహిళ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె పక్కనే ఉంటున్న గది ఖాళీ కావటంతో టూలెట్ బోర్డును పెట్టారు. 2వ తేదీ మధ్యాహ్నం ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఇద్దరు ఆగంతకులు పారిజాతను ప్లాస్టిక్ కుర్చీలో కట్టివేసి, కత్తితో బెదిరించి మూడున్నర తులాల బంగారు నగలు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకు వెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా ముందుగా ముషీరాబాద్ ఆర్యవైశ్య హస్టల్‌లో క్లీనింగ్‌బాయ్‌గా పనిచేస్తున్న సంగారెడ్డి జిల్లా గోడిచెర్ల గ్రామానికి ఎలగారి శ్రీకాంత్(26)ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో సంజీవపురంకు చెందిన ఎల్ల జ్యోతి(45)తో పరిచయం ఉందని తెలిపాడు. తన మేనత్త ఇంట్లో ఒంటరిగా ఉంటుందని ఆమె వద్ద బంగారునగలున్నాయని, అవి దోచుకురావాలని జ్యోతి సూచించిందని తెలిపాడు. జ్యోతి చెప్పిన ప్రకారం తాను, ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే ముషీరాబాద్ బొట్టి శ్రీరామ్‌నగర్‌కు చెందిన కొర్రోళ్ల ఈశ్వర్(19)ను కలిసి పారిజాత ఇంటికి వెళ్లి బెదిరించి బంగారు నగలు, సెల్‌ఫోన్‌ను దొంగిలించామని శ్రీకాంత్ పోలీసుల ముందు నేరం అంగీకరించాడు. దీంతో పోలీసులు ఎల్లజ్యోతి, ఎలగారి శ్రీకాంత్, కొర్రోళ్ల ఈశ్వర్‌ను ఆదివారం రిమాండ్‌కు తరలించారు. వారినుంచి మూడున్నర తులాల బంగారు నగలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును అతి తక్కువ సమయంలో ఛేదించిన ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్‌ను, డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, స్టాఫ్ గాలిబ్, ఎండీ దస్తగిర్, ఎస్.వేణు, రామకృష్ణ, దేవేందర్‌నాయక్, రజిత, వినయ్, గణేశ్, కృష్ణలను డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డిలు అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిత్రంలో నిందితులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న వీబీజీ గ్లోబల్ కార్యవర్గ సభ్యులు

కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

అడ్డగుట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి) : వాసవీ బిజినెస్ గ్రూపు కో-ఫౌండర్, గ్లోబల్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం సికింద్రాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. గ్లోబల్ అధ్యక్షుడిగా కొమురవెల్లి మారుతి, కార్యదర్శిగా కూకుట్ల సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు వూక సతీష్‌లను వీబీజీ వ్యవస్థాపక చైర్మన్ టిఎస్‌వి ప్రసాద్, వ్యవస్థాపకులు మడిపడి రాజులు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వైశ్య వ్యాపారస్తులందరినీ ఒకే తాటిపై తీసుకువచ్చి వ్యాపార అవకాశాలు పెంచేందుకు తమ సంస్థ దోహదపడుతుందన్నారు. ఇటీవల జరిగిన ఆరో వార్షికోత్సవ వేడుకలు అనంతరం తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, ప్రకాశ్, లింగయ్య, శ్రీకాంత్, సురేష్, స్వామి, శివకుమార్, కో- ఫౌండర్లు సతీష్, వెంకటేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.